కవితా కౌముది

# గజగజ అహర్నిశం

తుర్లపాటి రామానుజ రావు



ఆకాశం
వెన్నెలను
తీగెలుగా సాగదీసి
భూమికి నిచ్చెనలు వేస్తున్నట్లుంది..
రాత్రి
చంద్రుడిని ఎత్తుకుని
తాగిస్తున్న పాలు ఒలికి నేలపాలైనట్లున్నది..
దూరంగా కొండకు
తెల్లటి శాటిన్ పరదా కట్టిన్నట్లుంది ..
పై నుంచి ఎవరో భూమి పై
సన్న బియ్యం విసిరేసి
నాట్లు వేయమన్నట్లున్నది..
మంచు ముద్దులు
తడిమి చూసుకుని
కిటికీ అద్దం ఆనంద భాష్పాలు రాలుస్తున్నది ..
చెట్లన్నీ
ముత్యాల పేరులు వేసుకుని
గజిబిజిగా రాలిన
మంచు బిందువులకు
పండుటాకుల దుప్పట్లు కప్పి
జోకొడుతున్నట్లున్నాయి.
బాల్కనిలో
వానజల్లుగా రాలుతూ
మంచు
ఆరేసిన బట్టలను కప్పుకుంటున్నది..
ఇళ్ళన్నిటిపై
తెల్లటి గోపురం పెట్టినట్లున్నది
నగరం గద్వాల మంచు చీర కట్టినట్లున్నది..
ఈ చలికి మా ఇల్లు
గజగజా వణుకుతున్నది..!
వేడి వేడి కాఫీ కోసం వేచి చూస్తున్నది ..!!

★★★★



## జాతి జాగృతం
## ఆచాళ్ళ శ్రీనివాస రావు

ఏచోట మనసు నిర్భీతిగా నిలుచునో
ఏచోట మనిషి తలె యెత్తి జీవించునో
ఏచోట జ్ఞాన సిరి అమూల్యమ్మవునో
ఏచోట ప్రతిమాట సత్యజనితమ్మో...

ఆ స్వేచ్ఛాస్వర్గ ధామానికి
తండ్రీ ! నా జాతి జాగృతమ్మవనీ ...

ఇరుకు గోడల నడుమ చిద్ర శకలాలుగా
ఏచోట ఈ జగతి విచ్ఛిన్నమవదో
అలసటెరుగని శ్రమలు పరిపూర్ణ దిశగా
ఎచట చేతులు సాచి నడయాడునో ..
॥ఆస్వేచ్ఛాస్వర్గ ... ॥

స్వచ్ఛస్వేచ్ఛా యోచనాజీవవాహినిలు
నిర్జీవ ఎడారుల ఎచటింకి పోవో
ఎచట నీ వెన్నంటి మనసు ముందుకు సాగు
నిత్య వికసిత బుద్ధి సత్కార్య సిద్ధికై ...
॥ ఆ స్వేచ్ఛాస్వర్గ ... ॥

( విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ " Where the mind is without fear ..." కి స్వేచ్ఛానువాదం పాట రూపం లో ..)

★★★

## ఓ ఉదయం
## శ్రీధర్ చౌడారపు

పొగమంచు పరదాలవెనక
అస్పష్టంగా అగుపిస్తోంది నగరం,
వణికిస్తున్న చలి
మెల్లగా వీస్తున్న గాలి,
నిశ్శబ్దాన్ని నిద్రపుచ్చేందుకు
లేచొచ్చిన రణగొణధ్వనులూ,
చీకట్లను చీల్చేసుకుంటూ
విస్తరిస్తున్న వేకువకిరణాలు,
ఏమూలనుండో వినపడుతోన్న
పావురాళ్ళ కువకువలూ,
ఎత్తుగా నీలి ఆకాశసీమలో
ఎగిరెళుతూన్న కొంగలబారులూ,
సుందర ప్రకృతిదృశ్యంలో
అపశృతిగా వికృతిగా
ఉన్నికోట్లూ ఉలెన్ స్వట్టర్లూ,
మెడను చుట్టేసిన మఫ్లర్లూ,
ముఖాన్ని మూసేసిన మంకీక్యాపులూ,
పాదాలను మింగేసిన బూట్లూ,
అరచేతుల్ని దాచేసిన ప్యాంటుజేబులూ....,
వీధులు నిండుతున్న మానవ సమూహాలు..!!

★★★

# దేవతాపిట్ట

అల్లూరి గౌరీలక్ష్మి

మంచం చివర వయ్యారంగా వాలి తొంగి చూసిన నిద్ర పిట్ట
అలాగే దూరంగా ఊరిస్తూ ఉయ్యాల లూగుతుంటుంది,
బరువెక్కిన రెప్పలతో, దొన్నిదుప్పట్లో వెయ్యాలని నేను
ఫైళ్లలో రాసిన నోట్ వివరాల ఇరకాటాల అలజడీ,
డెడ్ లైన్ దాటుతున్నా సమకూడని ప్రాజెక్ట్ వివరాలూ
రంగుల పీ.పీ.టీ. లో నింపిన గందరగోళపు పాయింట్లూ,
ఊరునించొచ్చిన ఫోన్లో ఎవరో బంధువు పోయిన వార్తా
ఫేస్ బుక్ లో పెట్టిన కాళిదాసు కవిత్వపు చెణుకులూ,
వాట్సాప్ లో వచ్చి పడిన వీడియోల వింత విశేషాలూ
తీరక మొదటి కొచ్చిన ఇంటి సమస్యల ముళ్ళూ,
అపరిమిత తలపుల సుడిగుండమై గిర్రున తిరుగుతూ
నిద్రని దరికి రానీకుండా బెదర గొడుతుంటాయి !
జీవులకున్న వరం రాత్రనే తాత్కాలిక విరామం
మనశ్శరీరాల సేద దీతకై నే చేసిన మౌన విన్నపం
వినికూడా ఆ పిట్ట కంటి రెప్పలపై రెక్కలల్లార్చి పోతుంది!
ఎదురు చూసి చూసి విసిగి నిద్దర మాట మరిచాక.
ఎప్పుడొస్తుందో నా కనుగవల్ని నిమిరి నిద్రపుచ్చి
మదిలోని నిన్నటి సొదనంతా తుడిచి నిర్మల పరిచి
కొత్త రోజుకి నన్ను నిత్యమల్లి గా సమయాత్తం చేసి
అలారం నన్ను లేపగానే తుర్రున పారిపోతుంది.
అలిసిన చంద్రుడికి నిదుర దుప్పటి కప్పడం కోసం..!!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

కరచరణములు నీవి నా కనుల ముందు
కదలి తిరుగాడునంతలో కరగిపోవు
కరగినను గాని కన్పట్టు మరల మరల
జ్యోతి వెడలినగాని ప్రస్ఫుటము కాంతి

ఎన్నడో నీవు వెడలిపోయినను గాని
ఇచ్చటే యుంటివని యనిపించుచుండు
తనువిచటనుండి నిష్క్రమించినను గాని
ఆత్మ నాయొద్దనే తిరుగాడుచుండు

ఇనుడు పడమటనస్తమించినను గాని
సాంధ్యరాగము కనులకాశలను గొలుపు
నిస్పృహను వీడి యోర్పుతో నిలచియున్న
తిరిగి యుదయించు తూర్పున దినకరుండు

కనులకానదెచ్చటనో దాగిన పికమ్ము
రవము మాత్రము వినిపించు శ్రావ్యముగను
శ్రవణముల నీ పలుకు తాకజాలదిపుడు
అంతరాత్మను స్పృశియించి యనునయించు

కావలయు వారు మన సమక్షమ్మునందు
నిలువకున్నను మదిలోన నిలచియుంద్రు
ఎడద తాకక చెంతనే యెవ్వరున్న
అరయనేరము వాయువునరయనట్లు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS